క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం జిల్లా కార్ డ్రైవింగ్ స్కూల్ అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షుడిగా షేక్ ముస్తాఫాను ఎన్నుకున్నారు. సోమవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎం.కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వై.మధు, కార్యదర్శిగా ఎండి.జాకిరుద్దీన్, కోశాధికారిగా ఏవీ.స్వామి, గౌరవ సలహాదారుడిగా పిండిప్రోలు రామ్మూర్తిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ముస్తాఫా మాట్లాడుతూ... ఒకే డ్రైవింగ్, ఒకే కోర్సు, ఒకే ఫీజు నినాదంతో ముందుకు పోతామన్నారు. అనంతరం డ్రైవింగ్ నిబంధనలతో ప్రచరించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి కృష్ణ, సీతారాములు, చరణ్‌రెడ్డి, వేద రాజు,బాబా, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు విత్తన ఎంపికపై అవగాహన

రఘునాథపాలెం: రైతునేస్తం కార్యాక్రమంలో భాగంగా మండలంలోని వీవీపాలెం రైతువేదికలో మన టీవీ ద్వారా విత్తనాల ఎంపికపై మంగళవారం అవగాహన కల్పిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఇంటూరి భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బి.గోపి పరిచయం తర్వాత విత్తన ఎంపిక గేయం ఉంటుందని, అనంతరం అధిక సాంద్రత పత్తి సాగుపై రైతుల అనుభవాలు, అధిక సాంద్రత పత్తి పంటసాగులో యజమాన్య పద్ధతులు,సేంద్రీయ వ్యవసాయంపై రైతులతో ముఖా ముఖి చర్చ రైతుల సూచనలు ఉంటాయని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

అందుబాటులో జీలుగులు...

మండలంలోని వీవీపాలెం సహకార సంఘంలో రైతులకు జీలుగ పచ్చిరొట్టపంట విత్తనాలు రైతులకు రాయితీపై పంపిణీకి అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారులు తెలిపారు. అవసరం ఉన్న రైతులు పట్టాదారు పాసుపుస్తకాలు, ఆధార్ కార్డును తీసుకొని వచ్చి రాయితీ విత్తనాలు పొందవచ్చని పేర్కొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: అనారోగ్యంతో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రామిశెట్టి మనోహర్‌నాయుడిని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ నాయకుడు శెట్టి రంగారావు, సీపీఎం నాయకుడు ఎర్రా శ్రీకాంత్‌లు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన యోగక్షేమాలను అడిగితెలుసుకుని త్వరితగతిన కోలుకుని రావాలని వారు ఆకాంక్షించారు. కార్పొరేటర్ రాపర్తి శరత్, తాళ్లూరి హనుమంతరావు, సోమిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, నల్లమల వేణు, సోమయ్య, నాంపల్లి శంకరయ్య తదితరులు ఉన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	మనమే
వినోద	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
సాయిరాం	సత్యభామ
ఆదిత్య	రక్షణ, బ్యాడ్‌బాయ్స్
శ్రీనివాస	భజే వాయువేగం, నం.1
సుందర్	లవ్‌మౌళి

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	54	బచ్చలికూర	4
వంకాయ	16		20
బెండకాయ	20	పాలకూర	3
పచ్చిమిర్చి	70		20
కాకర	66	చుక్కకూర	3
బీర	76		20
దొండ	20	తోటకూర	4
పొట్లకాయ	40		20
చిక్కుడు	110	గోంగూర	3
గోరుచిక్కుడు	46		20
క్యాబేజీ	26	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	26		20
ఆలుగడ్డ	34	కొత్తిమీర	1
చామగడ్డ	50		30
క్యారెట్	60	పుదీన	1
క్యాప్సికం	80		20

-ఖమ్మం వ్యవసాయం

బస్సులోనే భోజనం..!

- తాగేందుకు నీరు కరువే
- శిథిలావస్థకు చేరిన భోజనశాల
- మరమ్మతులు, నిర్వహణపై అధికారుల పట్టింపులేని తనం
- పాత బస్టాండ్‌లో డ్రైవర్లు, కండక్టర్ల ఇక్కట్లు



బయట కూర్చుని భోజనం చేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు(ఇన్‌సెట్) శిథిలావస్థలో భోజనశాల గది

ఖమ్మంమయూరిసెంటర్: వందలాది బస్సులు వచ్చి వెళ్లే ఖమ్మం పాత బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు లేక ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పది పన్నెండు గంటల పాటు విధుల్లో ఉండే వారికి బస్టాండ్ ఆవరణలో విశ్రాంతి తీసుకునేందుకు, భోజనం చేసేందుకు సరైన వసతులు లేక అవస్థలు పడుతున్నారు. తమతో పాటు తెచ్చుకున్న భోజనాన్ని తినేందుకు స్థలం లేక బస్సుల్లోనే కూర్చుని తినాల్సిన పరిస్థితి నెలకొంది. ఖమ్మం పాత బస్టాండ్‌కు పల్లె వెలుగు బస్సులతో పాటు కోదాడ, మిర్యాలగూడెం, సూర్యాపేట ప్రాంతాల నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సులు వచ్చిపోతుంటాయి. దీంతో ఉదయం నుండి రాత్రి వరకు ఈ బస్టాండ్ ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. ఉదయం నుండి రాత్రి వరకు విధులు నిర్వర్తించే కార్మికులకు బస్టాండ్‌లో 10 నిమిషాలు కూర్చుని భోజనం చేసేందుకు స్థలం కూడా లేక డ్రైవర్లు, కండక్టర్లు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

శిథిలమైన భోజనశాల

నూతన బస్టాండ్ నిర్మాణానికి ముందు ఖమ్మం పాత బస్టాండ్‌లో సిబ్బంది కోసం ప్రత్యేక భోజనశాల ఉండేది. అందులో తాగునీటి సౌకర్యంతో పాటు చేతులు కడుక్కునేందుకు నీరు ఏర్పాటు చేశారు. కొత్త బస్టాండ్ ప్రారంభం తర్వాత పాత బస్టాండ్‌లోని భోజనశాల శిథిలావస్థకు చేరింది. కొన్నాళ్లకు పాత బస్టాండ్ నుంచి రవాణా సేవలను ప్రారంభించినప్పటికీ అక్కడ డ్రైవర్లు, కండక్టర్లకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేయడంలో సంస్థ యాజమాన్యం, అధికారులు విఫలమయ్యారు. ప్రస్తుతం పాత బస్టాండ్‌లో ఉన్న భోజనశాల శిథిలావస్థకు చేరడం, ఓ పక్కన గోడ కూలిపోవడంతో దానిలో కూర్చునే పరిస్థితి లేదు.

ఇబ్బంది పడుతూ.. బస్సులోనే..





పాత బస్టాండ్‌లోని భోజనశాల లేకపోవడంతో డ్రైవర్లు, కండక్టర్లను ఆర్టీసీ వైద్యశాలలో కూర్చుని భోజనం చేయాలని అధికారులు సూచించినట్లు తెలిసింది. అయితే వైద్యశాల సైతం శిథిలావస్థకు చేరడం, అక్కడ కూర్చునే పరిస్థితి లేకపోగా.. తాగేందుకు నీరు, చేతులు కడుక్కునేందుకు నీరు లేదు. దీంతో వారు బస్సులోనే కూర్చుని భోజనం తింటున్నారు. ఇంటి దగ్గర నుండి తెచ్చుకున్న నీటిని తాగేందుకు వినియోగిస్తున్నారు. మరికొందరు బస్టాండ్‌లో నీటిని పట్టుకొని తాగుతున్నారు. ఇక బస్సులో భోజనం చేసే సమయాన ప్రయాణికులు ఎక్కుతుండడంతో కండక్టర్లు, డ్రైవర్లు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. భోజనం చేసే వరకు వేచి ఉండాలని చెప్పినా ప్రయాణికులు వినకపోవడంతో ఇరువర్గాల నడుమ వాగ్వాదాలు సర్వ సాధారణమయ్యాయి.

‘నీట్’పై సమగ్ర విచారణ చేపట్టాలి



ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఇటీవల విడుదలైన నీట్ పరీక్ష ఫలితాలపై అనేక అనుమానాలు వెలువడుతున్న తరుణంలో పరీక్ష నిర్వహించిన తీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ కోరారు సోమవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయం నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగాయని విద్యార్థుల తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని, ఫలితాలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శులు నాగుల్‌మీరా, శివ నాయక్, వంశీ, హరికృష్ణ, బాలాజీ. శిరీష, మౌనిక, గౌతమి, శైలజ, పావని, సంధ్య ఉన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

నీట్–2024 పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ డిమాండ్ చేశారు. నగరంలో నీట్–2024 పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరిగాయని, పరీక్షను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ... నీట్ పరీక్షా ఫలితాల వెల్లడిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు. జూన్ 14న నీట్ ఫలితాలు వెల్లడిస్తామని తెలిపి, ఎలాంటి సమాచారం లేకుండా సార్వత్రిక ఎన్నికల ఫలితాల రోజున హడావిడిగా ఫలితాలు విడుదల చేయడమేమిటని ప్రశ్నించారు. పరీక్ష రద్దు చేయకుంటే ఆందోళన చేస్తామన్నారు. నాయకులు రాజు, కీర్తన, నవ్య, అనూష, శివాని, భావన, గంగోత్రి పాల్గొన్నారు.

వెనిగళ్ల రవికుమార్‌కు అవార్డు

ఖమ్మం సహకారనగర్: అమెరికాలోని అట్లాంటా నగరంలోని ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న 18వ అమెరికా తెలుగు అసోసియేషన్ (ఏటీఏ, ఆట) మహాసభల సందర్భంగా చేతన గ్లోబల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, అధ్యక్షుడు వెనిగళ్ల రవికుమార్‌కు ఆట(ఏటీఏ) అధ్యక్షుడు బొమ్మనేని మధు అవార్డు అందించారు. ఫౌండేషన్‌తో అమెరికా, ఇండియాతో పాటు ఏడు దేశాల్లో స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. విద్య, వైద్యం, మహిళా సాధికారిత, పర్యావరణం, వివిధ కార్యక్రమాలు చేపడుతున్నందున అవార్డు లభించింది. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. అంకితభావంతో పని చేస్తున్న వలంటీర్లకు ఈ అవార్డును అంకితం చేస్తున్నట్లు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న రవికుమార్

పుస్తకాలు పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ శ్రీనివాస్

ఖమ్మంఅర్బన్, రఘునాథపాలెం: ఖమ్మంఅర్బన్, రఘునాథపాలెం మండలాల పరిధిలో పాఠశాలలకు సోమవారం ఎంఈఓ ఎం.శ్రీనివాస్ పాఠ్య, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ మేరకు ఖమ్మం అర్బన్‌లోని 15 హైస్కూళ్లు, రఘునాథపాలెంలోని 10 హైస్కూళ్ల హెచ్‌ఎంలకు పాఠ్య పుస్తకాల పంపిణీ చేశామన్నారు.

16 వరకు లైట్ వెయిట్ గోల్డ్ జ్యూయెలరీ ఎగ్జిబిషన్

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని ఐటీ హబ్ ఎదురుగా ఉన్న లక్ష్మీ శ్రీనివాస జ్యూయెలరీస్‌లో లైట్ వెయిట్ గోల్డ్ జ్యూయెలరీ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు దుగ్గి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న ప్రారంభమైన ఎగ్జిబిషన్ ఈ నెల 16వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. రోజురోజుకు పెరుగుతున్న బంగారం ధరలను దృష్టిలో పెట్టుకొని అందరికి అందుబాటులో 2 గ్రాములు మొదలు చూడటానికి పెద్దివిగా కనబడే నెక్లెస్‌లు, చైన్లు, హారాలు విక్రయిస్తున్నట్లు తెలిపారు. బంగారం తక్కువగా ఉండే మోడళ్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహమ్మద్ సలాం కోరారు. సోమవారం ఎన్ఎస్‌టీ సెంటర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నగరంలోని శ్మశానవాటికలు కబ్జాకు గురయ్యాయని, అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు స్థలం కరువైందన్నారు. జిల్లా మంత్రులు ఈ సమస్యపై దృష్టిసారించాలని కోరారు.

సదుపాయాలు కల్పించాలి

కామేపల్లి: మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను వెంటనే ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ రవీందర్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, అందుకు అవసరమైన నిధులున్నాయని వెంటనే పనులను ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వరరావు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని కార్మికుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులకు తక్షణమే జీతాలు చెల్లించాలని సోమవారం ధర్నా నిర్వహించారు. కార్మికులకు సీఐటీయు, ఇఫ్టూ నాయకులు సంఘీబావం తెలుపుతూ ధర్నాలో బైఠాయించారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఆవరణలో పేషంట్ కేర్, సెక్యూరిటీ, పారిశుద్య కార్మికులు బైటాయించి తక్షణమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవటంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పోషణ కష్టతరంగా తయారైందని, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా సమస్యను పరిష్కరించట్లేదని వాపోయారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్. కిరణ్‌కుమార్ అక్కడకు వచ్చి జీతాలు చెల్లిస్తామని హామీ ఇవ్వటంతో కార్మికులు ధర్నా విరమించి విధుల్లో చేరారు.

స్టాక్ బోర్డులను ప్రదర్శించాలి



తనిఖీ చేస్తున్న ఏడీఏ విజయ్‌చంద్ర

ఖమ్మంరూరల్: విత్తన డీలర్లు తాము అమ్మే విత్తనాలకు సంబంధించిన రిజిస్టర్లు, స్టాక్ బోర్డులు తప్పనిసరిగా దుకాణాల ఎదుట ప్రదర్శించాలని ఏడీఏ ఎస్.విజయ్‌చంద్ర అన్నారు. సోమవారం మండలంలోని తల్లంపాడులో ఆయన విత్తన దుకాణాలను తనిఖీ చేసి రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విత్తనాలు కొనుగోలు సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని, విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు. ఎంఎన్‌సీ కంపెనీలకు సంబంధించిన మంచి విత్తనాలను, అవి కూడా లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని సూచించారు. కొందరు బీటీ విత్తనాల పేరుతో మోసం చేస్తారని, గ్రామాల్లో అలాంటి వ్యక్తులు వస్తే వెంటనే వ్యవసామశాఖ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించాలి



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ యర్రయ్య

నేలకొండపల్లి: మిషన్ భగీరథ పనితీరు గురించి క్షేత్ర స్థాయిలో సర్వేలో భాగంగా కచ్చితంగా వారి ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటా సర్వేను చేపట్టారు. ఈ మేరకు ఎంపీడీఓ యర్రయ్య సర్వేను పరిశీలించారు. ఇంటింటా వెళ్లి మిషన్ భగీరథ నీరు సక్రమంగా వస్తుందా, పైపు లైన్ నీరు ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ ప్రజలకు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే గుర్తించి నమోదు చేసుకోవాలని ఆయా పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పది రోజుల పాటు ఇంటింటా తిరిగి సమస్యలను తెలుసుకుని నివేదికను అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సి.హెచ్.శివ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిధులు సమర్థవంతంగా వినియోగించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల కింద పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించిన నిధులను సమర్థవంతంగా వినియోగించాలని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు కోరారు. ఈ మేరకు సోమవారం డీఈఓ సోమశేఖర శర్మకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సైదులు మాట్లాడుతూ... పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం నిధులను కేటాయించిన నేపథ్యంలో ఆయా పనులను తక్షణమే పూర్తి చేయాలన్నారు. ప్రతీ పాఠశాలకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలను సకాలంలో అందించాలన్నారు. బదిలీలు, పదోన్నతులు చేపట్టడం అభినందనీయమని, ఈ ప్రక్రియను సైతం పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదగిరి, మన్సూర్ పాల్గొన్నారు.

నివాళి..

నేలకొండపల్లి: ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వర రావు బాబాయ్ పుచ్చకాయల నారాయణ ఇటీవల మృతి చెందగా మండలంలోని ముజ్జుగూడెంలో సోమవారం జరిగిన దశదిన కార్యక్రమంలో నారాయణ చిత్రపటానికి నామా పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పీఓడబ్ల్యూ నాయకురాలికి..

ఖమ్మంరూరల్: మాస్‌లైన్ నాయకుడు మలీదు నాగేశ్వరరావు సతీమణి, పీఓడబ్ల్యూ నాయకురాలు పద్మ మృతిచెందగా సోమవారం ఆమె మృతదేహంపై పూలమాలలు వేసి సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య నివాళులర్పించారు. బందెల వెంకయ్య, నాగేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జి.రామయ్య, మారుతి మల్లయ్య, వీర్ల వెంకటప్పారావు, నంద్ర ప్రసాద్, బాణోత్ శంకర్, యాదగిరి, వెంకటరెడ్డి, పుల్లయ్య పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

రఘునాథపాలెం: మహిళపై వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని కోయచలక గ్రామానికి చెందిన వితంతువుపై అదే గ్రామానికి చెందిన ఎం.వెంకటేశ్వర్లు కొన్ని రోజులుగా వేధింపులకు పాల్పడుతున్నాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలి

రఘునాథపాలెం: నామినేటెడ్ పోస్టుల్లో దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలని మండలంలోని బూడిదంపాడుకు చెందిన కాంగ్రెస్ యువజన విభాగం నాయకుడు మంగీలాల్ చౌహాన్ సోమవారం ప్రకటనలో కోరారు. దివ్యాంగులకు ప్రాధాన్యత దక్కడం లేదని ప్రభుత్వం గుర్తించాలని కోరారు.

సాగు ముమ్మరం..!

- తొలకరి జల్లులతో మొదలైన ఖరీఫ్ పనులు
- దుక్కులు దున్ని, విత్తనాలు నాటే పనిలో నిమగ్నమైన రైతులు



ఖమ్మంరూరల్: ఆరేకోడులో పత్తి వేయడానికి అచ్చు తోలుతున్న రైతు

ఖమ్మంరూరల్/ తిరుమలాయపాలెం: వారం నుంచి అడపా దడపా కురుస్తున్న చిరు జల్లులతో రైతులు దుక్కులు దున్ని, పత్తి విత్తనాలు నాటే పనిలో నిమగ్నమయ్యారు. నియోజకవర్గ వ్యాప్తంగా దుక్కులు దున్ని, పత్తికి అచ్చు తోలుతూ విత్తనాలను కూడా నాటుతున్నారు. ఇప్పటికే రైతులు తమకు అవసరమైన విత్తనాలను కొనుగోలు చేశారు. గతేడాది కంటే అన్ని పంటలు ఈసారి ఎక్కువగానే సాగు చేస్తారని అధికారులు చెబుతున్నారు. మిర్చికి మార్కెట్‌లో ఆశించిన స్థాయిలో ధర ఉండటంతో రైతులు మిర్చి సాగు వైపు ఆసక్తి కనబరుస్తున్నారు. అదే విధంగా పత్తిపంటను మక్కువతో సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఇక వరి పంట కేవలం చెరువులు, కుంటలు, బావులు, బోర్ల ఆధారంగా సాగు చేయడానికి విత్తనాలను కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే పిల్లి పెసర, జనుము విత్తనాలను సేకరించి వరి వేసే భూముల్లో చల్లుతున్నారు. గతేడాది పత్తికి చీడపీడలు చేరి నీటి వసతి లేని భూములకు ఎకరాకు మూడు నుండి నాలుగు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. నీటి వసతి ఉన్న భూముల్లో మరో రెండు క్వింటాళ్లు అదనంగా దిగుబడి వచ్చింది. దీంతో ఈసారి రైతులు విత్తన ఎంపికతో పాటు నీటి వసతి కూడా చూసుకుని పత్తి సాగు చేస్తున్నారు.



విత్తనాలు విత్తుతున్న కూలీలు



తిరుమలాయపాలెంలో..

పెరిగిన భూముల కౌలు

ఇదిలా ఉండగా గతేడాది కంటే ఈ సారి కౌలు పెరిగడంతో కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. గతంలో ఎకరాకు వర్షాధార భూములకు రూ. 10వేలు, నీటి వసతి ఉన్న భూమికి రూ.16వేలు ఉండగా ఈసారి రూ.12వేలు, రూ.18వేలు వరకు పెరిగింది. కౌలు రైతులు కౌలుతో పాటు, పంట పెట్టుబడి, పెరిగిన కూలీల ఖర్చు కూడా భరించాల్సి రావడంతో కౌలు రైతులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు.

పాలేరు నియోజకవర్గ వ్యాప్తంగా సాగు వివరాలు(ఎకరాల్లో)

మండలం	పత్తి	మిర్చి	వరి
ఖమ్మం రూరల్	11,300	4,300	5,500
కూసుమంచి	13,200	6,300	8,500
తిరుమలాయపాలెం	14,600	7,100	5,800
నేలకొండపల్లి	3,500	500	--

ఎనిమిది ఎకరాల్లో పత్తి



ఈఏడాది ఎనిమిది ఎకరాల్లో పత్తి సాగు చేసేందుకు దుక్కులు దున్ని, అచ్చు తోలిన. ఇప్పటికే మూడు ఎకరాల్లో పత్తి విత్తనాలు నాటిన. మిగతా అయిదు ఎకరాల్లో రేపో,మాపో వర్షం పడితే విత్తుత. ముందుగా పెడితే చీడపీడలు రాకుండా దిగుబడి ఎక్కువ వస్తుంది.

– ఎస్. వెంకటనర్సయ్య రైతు, చేగొమ్మ

వర్షాలు ఉంటేనే విత్తుకోవాలి



రైతులు తొందరపడకుండా భూమి బాగా తడి పదును వచ్చిన తర్వాతే పత్తి విత్తనాలు నాటుకోవాలి. మండలంలో రైతులకు అవసరమైన పత్తి, పిల్లిపెసర, జనుము విత్తనాలు సరిపోను అందుబాటులో ఉన్నాయి. గ్రామాల్లో ఏఈఓల సూచనల మేరకు పంటలు సాగు చేసుకోవాలి.

– వి. నాగేశ్వరరావు ఏఓ, ఖమ్మంరూరల్